# బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా శ్రీదేవి

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రకటన

భీమవరం టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా అయినంపూడి శ్రీదేవి ఎన్నికయ్యారు. మంగళవారం భీమవరం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాల ప్రకారం జిల్లా అధ్యక్ష పదవిని ఈసారి మహిళలకు కేటాయించినట్లు ప్రకటించారు. జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని శ్రీదేవిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని శ్రీదేవికి అందించి అభినందించారు. పార్టీ ఎన్నికల పరిశీలకుడు అయ్యాజీ వేమా, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా వెంకటసత్యనారాయణ, బీజేపీ తాజా మాజీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనచౌదరి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ కురెళ్ల నర్సింహరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉన్నమట్ల కపర్ధి పాల్గొన్నారు

### పార్టీలో శ్రీదేవి ప్రయాణం

శ్రీదేవి భర్త ఐనంపూడి రామరాజు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2010లో తణుకులో బాబా డిజిటల్ ల్యాబ్‌ను ఏర్పాటుతో ఆమె బాబా మేడంగా అందరికీ సుపరిచితులు. 2012లో అప్పటి బీజేపీ జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, పైడికొండల మాణిక్యాలరావు, కోడూరి లక్ష్మీనారాయణ, టీవీఎస్ వర్మ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. 2012లో మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా, 2013లో బేటీ బచావో, భేటీ పడావో రాష్ట్ర కన్వీనర్‌గా, 2015లో మహిళా మోర్చా రాష్ట్ర సెక్రటరీగా, 2021లో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా, 2023లో బీజేపీ తణుకు నియోజవర్గ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2018 తణుకు ఏరియా ఫొటో స్టూడియో సంఘ అధ్యక్షురాలిగా, 2020లో తణుకు రోటరీ క్లబ్ అధ్యక్షురాలిగా, ఎన్నికయ్యారు. ప్రస్తుతం బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



### ఏలూరు జిల్లాకు విక్రమ్ కిశోర్



ఏలూరు రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా చౌటపల్లి విక్రమ్ కిశోర్ రెండోసారి ఎన్నికయ్యారు. ఏలూరు బీజేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో అధిష్ఠానం ఆయనను మరోసారి జిల్లా అధ్యక్షుడిగా సూచించడంతో విక్రమ్ పేరును ఎన్నికల పరిశీలకురాలు రేలంగి శ్రీదేవి ప్రకటించారు. సీనియర్ నాయకులు తపన చౌదరి, అంబికా కృష్ణ తదితరులు కిశోర్‌కు శాలువా కప్పి అభినందించారు. విక్రమ్ మాట్లాడుతూ తనపైన నమ్మకంతో రెండోసారి పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఇంకెంత కాలం ఇలా..

- ఎర్ర కాలువపై వంతెనకు రెండు దశాబ్దాలు
- మధ్యలోనే వదిలేసిన వైనం
- రూ. కోట్ల ప్రజాధనం వృథా



## కష్ట జీవులకు కేరాఫ్..

- వందేళ్లుగా తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ ఆసరాగా నిలిచింది
- కష్టపడే వారికి కష్టపడినంత
- వందలాది కుటుంబాలకు జీవనోపాధి

6

# అమృత్‌పై ఆరా



**ప్రాజెక్ట్ పనులపై పునఃపరిశీలన**

**ఆ తర్వాతే ఆమోదం.. ఆపై టెండర్లు**

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 ప్రాజెక్ట్‌లను పునఃపరిశీలిస్తున్నారు. వైసీపీ హయాంలో దాఖలు చేసిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తోంది. పనులను ఆమోదించడంలో జాప్యం చేసిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు టెండర్ల దశకు తీసుకొచ్చింది. అయితే వాటి అవసరాలు ఎంత మేర ఉన్నాయనే విషయమై తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. జిల్లా అధికారుల నుంచి సమాచారాన్ని సేకరిస్తోంది. ఆ తర్వాత తుది ఆమోదం తెలపనుంది. ఒక్క తాడేపల్లిగూడెం ప్రాజెక్ట్ మాత్రమే ముందుకు వెళుతోంది. పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన పట్టణాల్లో అమృత్ 2.0 ప్రాజెక్ట్‌లు మాత్రం ప్రభుత్వం తుది ఆమోదం తర్వాతే టెండర్ దశకు చేరుకోనున్నాయి. ఆ తర్వాతే టెండర్లు ఖరారు చేస్తారు. తదుపరి పనులు ప్రారంభిస్తారు. వాస్తవానికి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అమృత్ 2.0 అమలులోకి వచ్చింది. అప్పట్లో పనులు గుర్తించారు. వైసీపీ హయాంలో తీవ్ర జాప్యం చేశారు. జిల్లా నుంచి సమగ్ర నివేదిక ప్రాజెక్టులు పంపినా అనుమతులు ఇవ్వలేదు. ఎన్నికల ముందే హడావిడిగా ఆమోదం తెలిపింది. అప్పటికే ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. అయినా సరే టెండర్లపై కాంట్రాక్టర్లు స్పందించని పరిస్థితి. వైసీపీ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులు పడకేశాయి. అమృత్ 1.0 పనులు చేపట్టలేకపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాతే పనుల్లో కదలిక వచ్చింది. అమృత్ 2.0పైనా దృష్టి పెట్టింది. గతంలో ఇచ్చిన ప్రాజెక్ట్ నివేదికలపై మార్పులు, చేర్పులు చేస్తున్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు.

### జిల్లాకు రూ.286 కోట్లు



అమృత్ 2.0 ప్రాజెక్ట్‌లో జిల్లాకు రూ.286 కోట్లు కేటాయించారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నర్సాపురం, ఆకివీడు పట్టణాల్లో మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి నిధులు వెచ్చించనున్నారు. తాడేపల్లిగూడెంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు మాత్రమే మాత్రమే పురోగతిలో ఉన్నాయి. ఇక్కడ దాదాపు 41 కోట్లతో చెరువు పనులు చేపడుతున్నారు. మరో రూ.41 కోట్లతో పైపులైన్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలి. అప్పుడే రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వినుగడలోకి వస్తుంది. రూ.112.19 కోట్లతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను నిర్మించాలి. తద్వారా భూగర్భ డ్రైనేజీ అందుబాటులోకి రానుంది. మిగిలిన పట్టణాల్లోనూ మంచినీరు, డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించారు. డీపీఆర్ దశలో ప్రభుత్వం వద్ద ఉన్నాయి. వాటికి ఇప్పుడు మార్పులు చేర్పులు చేస్తున్నారు. అనంతరం తుది అనుమతులు ఇస్తారు. అప్పుడే టెండర్లు పిలవనున్నారు.

| పట్టణాలు | పనులు | నిధులు(రూ.కోట్లలో) |
|---|---|---|
| ఆకివీడు | మంచినీరు | 31.42 |
| నరసాపురం | మంచినీటి సరఫరా | 21.00 |
| భీమవరం | మంచినీటి సరఫరా | 47.29 |
| ,, హౌసింగ్ లే అవుట్ | మంచినీటి సరఫరా | 4.80 |
| ,, | సీవేజ్ ట్రీట్ మెంట్ | 13.39 |
| తాడేపల్లిగూడెం | మంచినీటి సరఫరా | 41.79 |
| ,, ,, హౌసింగ్ లే అవుట్ | మంచినీటి సరఫరా | 5.10 |
| ,, ,, | సీవేజ్ ట్రీట్‌మెంట్ | 112.39 |
| తణుకు హౌసింగ్ లే అవుట్ | మంచినీటి సరఫరా | 8.36 |

7

**సర్‌ప్లస్ టీచర్లకు సమీప మండలాల్లోనే సర్దుబాట్లు**



## పెండింగ్ కేసుల దర్యాప్తును పూర్తి చేయాలి

**నేర సమీక్షలో ఎస్పీ నయీం**

భీమవరం క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా వున్న ప్రాపర్టీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 'ప్రాపర్టీ కేసుల్లో ముద్దాయిలు అరెస్ట్ అయిన కేసులలో త్వరితగతిన ఛార్జిషీట్ దాఖలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన విచారణ జరిపి, బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలి. గ్రామాల్లో సందర్శించి ఎటువంటి తగాదాలు, నేరాలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో దొరికిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు సీజ్ చేయాలి. పేకాట శిబిరాలపైన, బెల్ట్ షాపులపైన చర్యలు తీసుకోవాలి. గంజాయి నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. గంజాయి కేసుల్లో అరెస్టయిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలి. నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ అక్రమ రవాణాను అరికట్టాలి. తప్పుడు నెంబర్ ప్లేట్‌లు ఉన్న వాహనాలను గుర్తించాలి. సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పాత ముద్దాయిలపై నిఘా ఉంచాలి' అని ఎస్పీ పేర్కొన్నారు. ఏఎస్పీ భీమారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీలు రావూరి గణేష్ జయసూర్య, జి.శ్రీవేద, డి.విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# గోతులే బెటర్!


సీసలి వద్ద పైకి లేచిన రాళ్లు

**తారు లేక.. పైకి లేచిన రాళ్లు**

**ముణ్ణాళ్ల ముచ్చటగా గుంతల పూడ్చివేత**

కాళ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి):ఆర్ అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. వాహనదారులు, ప్రయాణికులకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడా గోతులు లేకుండా గుంతలు పూడ్చే కార్యక్రమం కోసం నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. రాష్ట్రీయ రహదారి మరమ్మతుల కోసం పెద అమిరం నుంచి జక్కరం వరకు రూ.15 లక్షలు, జక్కరం నుంచి జువ్వలపాలెం వరకు రూ.40 లక్షలతో 15 రోజుల క్రితం పనులు చేశారు. ఇవి నాణ్యత లేకపోవడంతో ముణ్ణాళ్ల ముచ్చటగా మిగిలాయి. కాళ్ల, జక్కరం, సీసలి, దొడ్డనపూడి, కాళ్లకూరు తదితర గ్రామాల పరిధిలోని గోతుల్లో తారు వేయకుండా వదిలేయడంతో రాళ్లు పైకి తేలి వాహనదారులు, ప్రయాణికులతో పాటు పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా పనులు చేపట్టడం వల్లే ఈ రోడ్లు ఇలా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలు గోతులు పూడ్చకపోయినా బాగుండేదని ఎద్దేవా చేస్తున్నారు. ఏఈ కె.శ్రీహరి రాజు వివరణ ఇస్తూ సక్రమంగా లేనిచోట రానున్న రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.

**ఇది అధికారుల నిర్లక్ష్యం**

రోడ్డు వేసి పట్టుమని పది రోజులు పూర్తికాలేదు. ఈలోగా రాళ్లు పైకి లేవడం అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణం. తారు వేయకుండా వదిలేయడంతో రాళ్లు బయటకు వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాం. ఒక విజన్‌తో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఇలాంటి అధికారులు, కాంట్రాక్టర్ల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

- కె.నరసింహమూర్తి, కాళ్ల



**ఇవేం మరమ్మతులు..?**

భీమవరం-ఏలూరుపాడు రాష్ట్ర రహదారిపై ప్రయాణం చేయాలంటే భయమేస్తోంది. ఒకప్పుడు పెద్ద పెద్ద గుంతలతో భయపడేవాళ్లం. ఇప్పుడు తారు లేకుండా గోతుల్లో వేసిన రాళ్లపైకి లేవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అసలు ఇవేం మరమ్మతులు.. చూస్తే అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

- వి.రామారావు, వాహనదారుడు

**గీత కార్మికులకు 18 మద్యం షాపులు**

# కేటాయింపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తోంది. కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయించనుంది. జిల్లాల వారీగా షాపులను నిర్ధారించారు. పశ్చిమకు 18 షాపులను మంజూరుచేసింది. గీత కార్మికుల ఉపకులాల వారీగా వాటిని విభజించారు. శెట్టి బలిజకు 10, గౌడకు 5, గౌడ్ కులస్తులకు రెండు, శ్రీనయనకు ఒక షాపు వంతున కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లా ఎక్సైజ్ సూపరెంటిండెంట్ షాపులు ఎక్కడ ఇవ్వాలనేది గుర్తిస్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనాభాను ప్రాతిపదికన వీటిని కేటాయిస్తారు. ఇప్పటికే జిల్లాలో 175 ప్రైవేటు మద్యం షాపులు ఏర్పాటుచేశారు. అందులో పది శాతం అంటే 18 షాపులు గీత కార్మికులకు కేటాయించారు. దీనిపై ప్రతిపాదనలు పంపే బాధ్యతను జిల్లా సూపరింటెండెంట్‌కు అప్పగించారు. వీటిని ఎక్సైజ్ శాఖ ఆమోదిస్తుంది. ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షలు చెల్లించాలి. లాటరీ పద్ధతిలో వీటిని కలెక్టర్ ఎంపిక చేస్తారు. గతంలో మాదిరి విధి విధానాలు ఖరారు చేశారు. ఒకరి పేరుతో ఒక లైసెన్స్ మాత్రమే మంజూరుకానుంది. దరఖాస్తుదారుడు స్థానికుడై ఉండాలి. నోటిఫికేషన్‌లో వివరాలు స్పష్టం చేస్తారు. ప్రైవేటు లైసెన్స్‌దారులు మాదిరిగా గీత కార్మికులకు కమీషన్ వర్తించనుంది. ప్రస్తుతం 9 శాతం లభిస్తోంది. ప్రభుత్వం దానిని 14 శాతానికి పెంచనుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం లైసెన్స్‌దారులు ఎదురుచూస్తున్నారు. గతంలో జిల్లావ్యాప్తంగా గట్టిపోటీ నెలకొంది. అత్యధికంగా దరఖాస్తులు చేసుకున్నారు. అనుకున్న రీతిలో కమీషన్ రావడం లేదంటూ లైసెన్స్‌దారులు ఘొల్లుమంటున్నారు. గీత కార్మికులకు కేటాయించిన షాపులపై స్పందన ఎలా ఉంటుందనే విషయం ఆసక్తిగా మారింది.

# వాయిదాల వారధి

- వశిష్ఠ వారధి నిర్మాణానికి తెరుచుకోని టెండర్లు
- ఇప్పటికి 19సార్లు వాయిదా
- రెండేళ్లుగా ఇదే తంతు..
- భూసేకరణ పూర్తి.. పరిహారం చెల్లింపు
- జాప్యంతో పెరిగిపోతున్న అంచనా వ్యయం



నరసాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నరసాపురం వద్ద వశిష్ఠ వారధి నిర్మాణ పనుల టెండర్లు 19వ సారి వాయిదా పడింది. నరసాపురం మండలం రాజుల్లంక - కోనసీమ జిల్లా రామేశ్వరాన్ని కలుపుతూ వారధి నిర్మించాలి. దీనికి గత ప్రభుత్వ హయాంలో కేంద్రం రూ.490 కోట్లు కేటాయించింది. తీరం వెంబడి 216 జాతీయ రహదారిని బైపాస్‌గా విభజించి గోదావరిపై వారధి నిర్మాణ పనులు చేపట్టే విధంగా డిజైన్ రూపొందించారు. దిండి నుంచి సఖినేటిపల్లి, రామేశ్వరం మీదుగా నరసాపురం మండలం రాజుల్లంక, లక్ష్మణేశ్వరం, వైఎస్ పాలెం మీదుగా సీతారాంపురం వద్ద 216 జాతీయ రహదారిలో కలుస్తుంది. 25 కిలోమీటర్ల ఈ బైపాస్ రహదారిలో రామేశ్వరం - రాజుల్లంక మధ్య వారధి నిర్మించే విధంగా డిజైన్ చేశారు. 2022 నవంబరులో అప్పటి సీఎం జగన్ పనులకు శంకుస్థాపన చేశారు. 2023 ఆగస్టులో పనులకు టెండర్లు పిలిచారు. రెండు జిల్లాల్లో భూసేకరణకు కేంద్రం రూ.60 కోట్లు విడుదల చేసింది. నరసాపురం మండలంలో రైతుల నుంచి ఎటువంటి సమస్య రాలేదు. భూములిచ్చిన రైతుల ఖాతాల్లో పరిహారం పూర్తిగా జమ చేసింది. కోనసీమ జిల్లాలో కొందరు రైతులు అలైన్‌మెంట్ మార్చాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో అప్పటి నుంచి టెండర్లు తెరవకుండా 19 సార్లు వాయిదా వేస్తూవచ్చారు. ఈ నెలలోనూ అదే పరిస్థితి పునరావృతమైంది. ఇలా రెండేళ్లపాటు జాప్యం కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగింది. ఇటీవల కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసి విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ఇది కొలిక్కి రావచ్చునని అంతా ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

## రిజిస్ట్రేషన్‌లకు ఆటంకాలు

**పనిచేయని సర్వర్..**

**నిలిచిన లావాదేవీలు**

**కక్షిదారుల నిరీక్షణ**

ఆచంట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వచ్చే నెల నుంచి భూముల విలువ పెంచనున్న నేపథ్యంలో కొన్ని రోజులుగా రిజిస్ట్రేషన్‌లు జోరుగా సాగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా వరుస సెలవులు అనంతరం రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కక్షిదారులతో కిటకిటలాడుతున్నాయి. మంగళవారం సర్వర్ పనిచేయకపోవడంతో ఉదయం 11 గంటల నుంచి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. తొలుత అమ్మిన, కొనుగోలు చేసిన వారితో ఈకేవైసీ పూర్తి చేసి, ఈ సైన్ ప్రక్రియతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. కేవలం ఈకేవైసీ పనిచేసి ఈ సైన్ ప్రక్రియ పని చేయకపోవడంతో జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌లకు ఆటంకం ఏర్పడింది. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కక్షిదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నప్పటికి చివరకు రిజిస్ట్రేషన్‌లు అవకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు. జిల్లాలో రోజులను బట్టి 500 నుంచి వెయ్యి వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. ప్రభుత్వా నికి కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుంది. అయినప్పటికీ సర్వర్‌లను ఆధునికీకరించడం లేదని కక్షిదారులు వాపోతున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై స్పందించాలి.

### అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల ప్రకటనలో నిజం లేదు : కలెక్టర్

భీమవరం టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట సర్క్యులేట్ అవుతున్న వార్తల్లో నిజం లేదని కలెక్టర్ నాగరాణి స్పష్టం చేశారు. ఉద్యోగాలకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే జిల్లా కలెక్టర్ పేరిట ప్రకటన విడుదల చేస్తామని, ఇటువంటి ప్రకటనలను నమ్మి ప్రజలు మోసపోవద్దని పేర్కొన్నారు. తప్పుడు ప్రకటనల ద్వారా ప్రజలను గందరగోళ పరిస్థితులు సృష్టించిన వారిపై క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలోని ఈ నెల 31వ తేదీ వరకు ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను అందుబాటులో ఉంచినట్టు కలెక్టర్ తెలిపారు.

## వీల్‌చైర్ క్రికెట్ రాష్ట్ర కెప్టెన్‌గా రాజశేఖర్



పాలకొల్లు టౌన్, జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): పాలకొల్లు పట్టణం లోని రామారావుపేటకు చెందిన ఎంఎస్ రాజశేఖర్ రాష్ట్ర వీల్ చైర్ క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా ఎంపిక చేసినట్టు రాష్ట్రవీల్ చైర్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించిందని రాజశేఖర్ మంగళ వారం తెలిపారు. ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్‌లోని గాల్వియర్‌లో జరిగే 4వ జాతీయస్థాయి వీల్‌చైర్ క్రికెట్ పోటీల జట్టుకు రాజశేఖర్ కెప్టెన్‌గా వ్యవహ రిస్తారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం ఉంటే వైకల్యాన్ని జయించ వచ్చునని తెలిపారు. ఐదేళ్ళుగా వీల్ చైర్ క్రికెట్ టీంకు రాష్ట్రం తరపున కెప్టెన్‌గా వ్యవహ రించి, పలు టోర్నమెంట్లలో రాణించి గుర్తింపు తెచ్చుకున్నాడు. రాజ శేఖర్‌ను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

## గిరిజన ప్రతిభకు పురస్కారం.. గణతంత్ర వేడుకలకు ఆహ్వానం

పోలవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పాపికొండల అభయారణ్యంలో మారుమూల గ్రామాల్లో ఉంటున్న గిరిజనులకు ఢిల్లీలో జరగనున్న గణ తంత్ర వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఎంపికైన నలుగురు గిరిజనులు ఢిల్లీ బయల్దేరి వెళ్ళారు. గిరిజనాభివృద్ధి కోసం గతేడాది ప్రధాన మంత్రి మన్‌ధన్ వికాస్ కేంద్రాలు ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా మండ లంలో కొంతమంది గిరిజనులను ఎంపిక చేసి వారికి ఐటీడీఏ ద్వారా విస్తరాకుల తయారీ, యంత్రాల ద్వారా వేరుశెనగ గుళ్ల వేరు చేయడం, జీడిగింజల నుంచి జీడిపప్పు వేరు చేయడం లాంటి పనుల్లో శిక్షణ ఇచ్చి యూనిట్లు మంజూరు చేశారు. దీంతో ఆ యూనిట్ల ద్వారా గిరిజనులకు స్వయం ఉపాధి చేకూరి ఆర్థికాభివృద్ధి జరిగింది. దీంతో ఆయా యూనిట్ల నిర్వహణలో క్రియాశీలకంగా పని చేసిన ముగ్గురు మహిళలు, ఒక యువకుడిని ఢిల్లీ గణతంత్ర వేడుకలలో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. వింజరం డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సీఏ మడకం కృష్ణవేణి, గెడ్డపల్లి గ్రామానికి చెందిన సోడెం మంగమ్మ, గార్ల గొయ్యి గ్రామానికి చెందిన పొట్టోడి శ్రీవిద్య, కొరుటూరు గ్రామానికి చెందిన కుర్ల పోసిరెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు.

## పునరావాస జాబితాలో గల్లంతైన ఇళ్లకు సర్వే



కుక్కునూరులో ఇళ్ల కొలతలు వేస్తున్న దృశ్యం

కుక్కునూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పోలవరం పునరావాస ప్రక్రియలో భాగంగా ప్రతీ నిర్వాసితునికి వ్యక్తిగత పునరావాస పరిహారం కోల్పోతున్న ఇళ్ళకు పరిహారం అందించాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుక్కునూరు ఏ.బ్లాక్‌కు చెందిన దాదాపు 100 మందికి పైగా నిర్వాసితుల ఇళ్ళ పరిహారం జాబితాలు గల్లంతయ్యాయి. న్యాయం చేయ్యండని ఎన్నిసార్లు మొరపెట్టుకున్న వైసీపీ ప్రజా ప్రతినిధులు, అప్పటి అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వాసితులపై దృష్టి సారించింది. ఈ క్రమంలో రూ.995 కోట్ల పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసింది. కుక్కునూరు ఏ.బ్లాక్‌కు చెందిన వందమంది నిర్వాసితుల పేర్లు ఇళ్ళ జాబితాలో గల్లంతవడంతో వారికి పరిహారం అందలేదు. ఈ క్రమంలో కుక్కునూరు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, ఇటీవల భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి సమస్య వివరించారు. దీనికి స్పందించి జాబితాలో గల్లంతైన ఇళ్ళ జాబితాను సర్వే చేయాలని ఆదేశించారు. దీంతో మంగళ వారం ఆర్అండ్‌బీ డీఈ విజయ్‌శ్రీకార్, ఏఈ రాజు ఆధ్వర్యంలో కుక్కునూరు ఏ.బ్లాక్‌లో సర్వే చేపట్టారు. ఇంటి విలువ కొలతల ప్రకారం అంచనా రూపొందించి అధికారులకు నివేదిక ఇవ్వనున్నారు. 41.15 కాంటూరు లేవిల్‌లో ఉన్న కివ్వాక నిర్వాసిత గ్రామాల్లో కూడా దాదాపు 100కు పైగా నిర్వాసితుల ఇళ్ళ పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. సర్వే జరిపి న్యాయం చేయాలని అక్కడ నిర్వాసితులు కోరుతున్నారు.

## ఆకట్టుకున్న కోమలి దేవి కూచిపూడి నృత్య ప్రదర్శన



భీమవరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ 61వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కొటికలపూడి గోవిందరావు కళావేదికపై విశాఖపట్నంకు చెందిన వేమిరెడ్డి కోమలి దేవి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు శృంగవృక్షంకు చెందిన పద్మాలమ్మ మురళీకోటాలం బృందం కోలాటం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు మచిలీపట్నంకు చెందిన పాండురంగ ఆర్కెస్ట్రా వారిచే సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. రాత్రి 8-30కు విజయవాడకు చెందిన రఫయిల్ సత్య హరిశ్చంద్ర కాటి సీను ఏకపాత్ర చేశారు. రాత్రి 9 గంటలకు శ్రీరామాంజనేయ యుద్ధం నాటకం ప్రదర్శించారు.

# ఇంకెంతకాలం ఇలా..?

### ఎర్రకాలువపై వంతెనకు రెండు దశాబ్దాలు





ఎర్రకాలువపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు లేకుండా నిలిచిపోయిన నిర్మాణం

### మధ్యలోనే వదిలేసిన వైనం
### రూ. కోట్ల ప్రజాధనం వృథా

తణుకు రూరల్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి) తణుకు, తాడేపల్లి గూడెం మండలాల శివారు గ్రామాల్లో ఎర్ర కాలువపై నిర్మించిన వంతెన ప్రజా వినియోగంలోకి రాకపోవడంతో ఎర్రకాలువకు ఇరువైపులా వున్న గ్రామాల ప్రజల చిరకాల కల కలగానే మిగిలిపోయింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన రూ.4 కోట్లతో నిర్మాణం చేపట్టిన ఈ మధ్యలోనే ఆగిపోవడంతో నిరుపయోగంగా మారింది.

#### 2005 లో ఆధునికీకరణ

జిల్లాలో అతి పెద్ద మురుగు నీటి పారుదల కాలువగా వున్న ఎర్ర కాలువ ఆధునికీకరణ పనుల్లో భాగంగా 2005 సంవత్సరంలో భాగంగా ఎర్ర కాలువ గట్లపై ఆక్రమణలు తొలగించి గట్లను పటిష్టం చేయడంతో పాటు పంట పొలాలను వరద ముంపు నుంచి కాపాడేందుకు ఆనాడు ఎర్ర కాలువ గట్ల వెంబడి వున్న ఆక్రమణలు తొలగించి వెడల్పు చేశారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా వచ్చే మురుగునీరు సముద్రంలోకి చేర్చే మురుగు డ్రైన్లను స్థానికంగా వివిధ పేర్లతో పిలుస్తారు. నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం గ్రామాల్లో ఎర్రకాల్వగా పిలుస్తారు. తణుకు మండలంలోని దువ్వ, అత్తిలి మండల గ్రామాల్లో దువ్వ వయ్యేరుగా పిలుస్తారు. పెంటపాడు, ఉండి, పాలకోడేరు, భీమవరం మండలాల్లో దీనిని యనమదుర్రు డ్రైన్‌గా పిలుస్తారు. ఎర్ర కాలువ ప్రవహించే నిడదవోలు నుంచి భీమవరం వరకూ వున్న మురుగు డ్రైన్‌పై వివిధ మండలాల్లో ప్రపంచ బ్యాంకు నిధుల సహాయంతో 8 చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల గ్రామం, తణుకు మండలం కోనాల గ్రామ శివారులో ఒకటి, తణుకు మండలం దువ్వ గ్రామంలో, పెంటపాడు మండలం బీ.కొందేపాడు, మీన వల్లూరు, పాలకోడేరు మండలంలో ఒకటి, భీమవరం పట్టణంలో ఒకటి, భీమవరం మండలంలోని లోసరిలో ఒకటి చొప్పున వంతెనల నిర్మాణం చేపట్టారు. ఈ వంతెనలు వివిధ దశలలో ఆగిపోవడంతో కొన్నింటిని స్థానిక సంస్థల నిధులతో అప్రోచ్ రోడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులో వుంచారు.

#### మూడు నియోజకవర్గాల ప్రజలకు ప్రయోజనం

తణుకు మండలం కోనాల గ్రామ శివారు ఉండ్రాజవరం మండలం పసలపూడి గ్రామాల శివారులో నిర్మించిన వంతెన అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఈ వంతెన ద్వారా తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాలకు చెందిన గ్రామాల ప్రజలకు దగ్గరి మార్గం ఏర్పడనుంది. గతంలో ఈ వంతెన నిర్మించిన ప్రాంతంలో దోనె ద్వారా ఉండ్రాజవరం మండలంలోని పసలపూడి, కాల్దరి, సూర్యారావు పాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం గ్రామాలు, తాడేపల్లిగూడెం మండలానికి చెందిన ఆరుళ్ల, మారంపల్లి, జగన్నాథపురం, మాధవరం, తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ దోనె సహాయంతోనే ఎర్ర కాలువ దాటి ప్రయాణాలు సాగించేవారు. అయితే 2005లో ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టడంతో ఇక్కడ దోనె తొలగించారు. ఈ వంతెన పూర్తయితే జిల్లాలకు చెందిన మూడు నియోజకవర్గాల ప్రజలకు దగ్గరి మార్గం ఏర్పడుతుందని ఆశించారు. ఈ వంతెన నిర్మాణం మొత్తం నాలుగు స్పాన్‌లుగా నిర్మాణం చేపట్టారు. దీనితో ఒక స్పాన్‌లో లోపాలున్నట్లు గుర్తించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయితే ఈవంతెనకు ఇరువైపులా గ్రామాలకు సంబంధించి అప్రోచ్ రోడ్లు నిర్మాణం చేపట్ట వలసి వుంది. అసంపూర్తిగా నిలిచిపోయి దశాబ్దాలు గడుస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. 2015లో అప్పటి దేవదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత అధికారుల నుంచి వివరాలు తీసుకున్నా వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించలేకపోయారని అనంతరం వచ్చిన ఎమ్మెల్యే, మంత్రులు దీనిపై దృష్టి సారించకపోవడంతో ఇది పూర్తిగా మరుగున పడిపోయిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఈ విషయంపై తణుకు, తాడేపల్లిగూడెం ఇరిగేషన్, డ్రైనేజీ శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికా రులను వివరణ కోరగా వారు ఈ వంతెన నిర్మాణం 20 ఏళ్ల క్రితం జరిగింది. దీనికి సంబంధించిన వివ రాలు మాకు తెలియవు అని ఒకరు, ఎర్రకాలువపై వంతెన మా పరిధి కాదని మరి కొందరు సమాధానం చెబుతున్నారు.

**• ప్రజాధనం సద్వినియోగం చేయండి**



తణుకు, తాడేపల్లిగూడెం మండలాల గ్రామాల మధ్యలో ఎర్ర కాలువపై కోట్ల రూపాయల ప్రజా ధనంతో రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన వంతెన ప్రజలకు అందుబాటులో వుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.ఈ వంతెన ద్వారా తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాల గ్రామాల మధ్య దూరం తగ్గి ప్రజలకు దగ్గరి మార్గంగా వుంటుంది. వంతెనకు మిగిలి పోయిన పనులతో పాటు ఇరువైపులా అప్రోచ్ రోడ్డులను త్వరగా ఏర్పాటు చేయాలి.

**-బూరుగుపల్లి ఆనంద రమేష్, మాజీ సర్పంచ్, కోనాల**

**• నిర్మాణ పనులు ప్రారంభించాలి**



తణుకు మండలం కోనాల శివారు, ఉండ్రాజవరం మండలం పసలపూడి గ్రామాల మధ్య ఎర్రకాల్వ వంతెన నిర్మాణంలో వున్న లోపాలను సరిచేసి ప్రయాణాలకు అనుకూలంగా మార్చాలని 15 ఏళ్లుగా ఎమ్మెల్యేలను, మంత్రులను కోరు తున్నాం. దివంగత మంత్రి మాణిక్యాలరావు చొరవతో అధికారులు కొంత ప్రయత్నం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. నిర్మాణ పనులు పారరంభించాలి.

**-షేక్ షాజహాన్, పసలపూడి,మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు,ఉండ్రాజవరం**

## తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలు





తెన్నేటి మాస్టారు, బాలచందర్‌లను సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు/ పెనుగొండ జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా సాహితీవేత్త, పాలకోడేరు తెలుగు మాస్టారు తెన్నేటికి తెలుగు భాష, సాహిత్యాలలో చేస్తున్న కృషిని గుర్తించిన అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ కళావేదిక, తెలుగు అసో సియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయిట్రీ అకాడమీలు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందజేశాయి. మంగళవారం విజయవాడలో అవార్డు అందు కున్నారు. పెనుగొండకు చెందిన ప్రముఖ కవి, రచయిత, గాయకుడు, ఆస్కా చైర్మన్ డాక్టర్ బాలచందర్, వడలి గ్రామానికి చెందిన కవి, రచయిత, గాయకుడు సామాజిక కార్యకర్త సురేష్ నాయుడు కూడా అవార్డులు అందు కున్నారు.





కోలమూరులో శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటక ప్రదర్శనలో సన్నివేశాలు

## ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు

ఉండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సురభి వారి శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఉండి మండలం కోలమూరు సంతాన గోపాలస్వామి ఆలయంలో ముక్కోటి, ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శ్రీవినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటకం ప్రదర్శించారు. వెరైటీ సెట్టింగులు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కంసుడు వధ ప్రధాన ఇతి వృత్తంతో ఈ నాటకం ప్రదర్శించారు. కళాకారులను కరతాళ ధ్వనులతో ఉత్తేజపరిచారు. నాటకాలను తిలకించడానికి కోలమూరు, ఉప్పులూరు, పాములపర్రు, ఆరేడు, కలిగొట్ల, పాందువ్వ యండగండి, ఉండి, భీమవరం, గణపవరం, నిడమర్రు, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు, వీరవాసరం, తోకలపూడి, పాలకొల్లు తదితర ప్రాంతాలు నుంచి కళాభిమానులు విచ్చేశారు. ఆలయకమిటీ చైర్మన్ నంబూరి బదిరీ నారాయణరాజు,ఈవో మంతెన రామరాజులతో పాటు రుద్రరాజు రవి కుమార్‌రాజు, పేరిచర్ల శ్రీనివాసరాజు, బలరామరాజు, అప్పలరాజు, కెవిరాజు, ముదునూరి సతీష్‌రాజు, నరసింహరాజు పర్యవేక్షించారు.

#### కోలమూరులో సందడి

సురభీ నాటకాల ప్రదర్శనలతో కోలమూరు గ్రామం సందడిగా మారింది. నాటకాలు, లైటింగ్ చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో సందడి వాతావరణం నెలకొంది. బుధవారం రాత్రి లవకుశ , గురువారం శ్రీనివాస కల్యాణం నాటకం ప్రదర్శించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.



ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న దృశ్యం



ఏలూరు రైల్వేస్టేషన్ రోడ్డులో..

**మంచు ముసుగు**

పొగమంచు కప్పేసింది.. ఉదయం పది దాటినా చలి మాత్రం తగ్గడం లేదు.. గజగజ వణికిస్తోంది.. మంగళవారం ఉదయం ఆరుగంటల సమయంలో ఏలూరులో దట్టంగా అలముకున్న మంచు దృశ్యాలు

**• 40 ఏళ్లుగా ఇక్కడే పని చేస్తున్నా..**



40 సంవత్సరాల నుంచి ఇదే మార్కెట్‌లో పని చేసుకుంటున్నాను. ఈ పనినే నమ్ముకుని పొట్ట పోసుకుంటున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరికి వివాహం అయ్యింది. ఈ మార్కెట్‌లో పనిచేస్తూనే మా పిల్లలిద్దరికి పెళ్లిళ్ల చేశాను. ఈ మార్కెట్ మాకు అమ్మ లాంటిది. ఎంతో మందికి నీడనిచ్చే చల్లని తల్లి మా బ్రహ్మానందరెడ్డి మార్కెట్.

**- ఏపూరి శ్రీను, జట్టు కార్మికుడు**

**• ఓపిక ఉన్నంతవరకు ఇక్కడే..**



మాది దర్శిపర్రు. నేను ఈ మార్కెట్‌లో పనిలోకి వచ్చి సుమారు 45 సంవత్సరాలు పైగా అవుతుంది. అప్పట్లో నాకు కూలి వారానికి రూ.15 వచ్చేవి. ఇప్పుడు రోజూ రూ.600 నుంచి 700 వరుకూ సంపా దిస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. నాకు ఓపిక ఉన్నంతవరుకూ ఇదే మార్కెట్‌లో పని చేస్తాను. మా అందరికి అన్నం పెట్టి చల్లగా చూసే ఈ మార్కెట్ పది కాలాల పాటు బాగుండాలని కో రుకుంటున్నాను.

**- గంధం సత్యనారాయణ, జట్టు కార్మికుడు**

# కష్ట జీవులకు కేరాఫ్..

ఉల్లిపాయలు లోడ్ చేస్తున్న కార్మికులు →



కష్టేఫలి అన్నారు పెద్దలు. కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని దీని అర్థం. తాడేపల్లిగూడెం పట్టణ నడిబొడ్డున ఉన్న బ్రహ్మానందరెడ్డి మార్కెట్ కష్టపడేవారికి లోటు లేకుండా జీవనం కల్పిసోంది.. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కల్గిన ఈ మార్కెట్ కష్టజీవుల పాలిట కల్పవల్లిగా ఉంటున్నది. వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాలకు జీవనోపాధిగా మారింది. వాణిజ్య కేంద్రంగా తాడేపల్లిగూడేనికి పేరు రావడానికి ఈ మార్కెట్ కీలకమని చెప్పవచ్చు.. ఆ రోజుల్లో దాతలు ఇచ్చిన స్థలంలో గ్రామ పెద్ద బ్రహ్మానందరెడ్డి దీన్ని ప్రారంభించడంతో ఆయన పేరే పెట్టారు.

-పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

**వందేళ్లుగా ఆసరా ఇస్తున్న తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్**

**కష్టపడే వారికి కష్టపడినంత..**

**వందలాది కుటుంబాలకు జీవనోపాధి**

**వాణిజ్య కేంద్రంగా ఖ్యాతికి ఈ మార్కెట్టే కీలకం**



బత్తాయి పండ్లను సంచుల్లో లోడింగ్ చేస్తున్న కార్మికులు

రోజుకూలీ చేసుకునే కార్మికులకు, చిరు వ్యాపారులకు తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ కేరాఫ్‌గా నిలుస్తున్నది.. ఈ మార్కెట్‌లో పండ్లు, ఉల్లిపాయలు, కూరగాయలు, అపరాలు ఇలా అనేక వ్యాపారాలు సాగుతుంటాయి. పండ్ల మార్కెట్‌లో పర్మినెంట్‌గా 100 మంది కార్మికులు, ఉల్లిపాయల మార్కెట్‌లో సుమారు 300 మంది కార్మికులు ఉంటారు. వీరు కాకుండా గుమస్తాలు, లైన్ తిరేగేవారు ఇలా వేలాది మంది ఈ మార్కెట్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తెల్లవారుజామునే మార్కెట్‌కి వచ్చి సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటారు..

#### కోట్లలో వ్యాపారం

ఈ మార్కెట్‌లో ఒక్క ఆదివారమే కోట్లలో వ్యాపారం జరుగుతూంటుంది. పండ్లు , ఉల్లిపాయలకు తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ ప్రసిద్ధి.. షోలాపూర్, కర్నూలు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రం ఉల్లిపాయల లారీలు వందల సంఖ్యలో ఈ మార్కెట్‌లోకి వస్తాయి. ఇక్కడ దిగుమతి అయిన అనంతరం సమీప ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతాయి. పండ్లు కూడా అంతే. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే దిగుమతి అవుతాయి. ఇక్కడ నుంచి హోల్‌సేల్ ధరలకు సమీప ప్రాంతాలకు వెళ్తాయి. దీంతో ఆదివారం మార్కెట్ జనసందోహంగా కనిపిస్తుంది. మున్సిపాలిటీకి కూడా ఈ మార్కెట్‌పై పన్నుల రూపంలో మంచి ఆదాయం వస్తుంది.

#### చిరు వ్యాపారులకు కన్నతల్లిగా..

ఈ మార్కెట్‌లో పనిచేసే వారికి మాత్రమే కాదు .పట్టణంలో అనేక మంది బండ్లపై పండ్లు తదితర వ్యాపారాలు చేసుకునే వారికి కూడా ఈ మార్కెటే కన్నతల్లిగా ఆదరిస్తుంది. ప్రతీ రోజు ఉదయం తమకు కావలిసిన పండ్లు ఈ మార్కెట్ నుంచి కొనుగోలు చేసి బయట బండ్లపై లేదా గ్రామాల్లో మోటర్‌సైకిళ్ల, సైకిళ్లపై వ్యాపారాలు చేసుకుంటూ అనేకమంది తమ కటుంబాలను పోషించు కుంటున్నారు.

#### ఒకప్పుడు ఉప్పుడు బియ్యం అమ్మకాల్లో టాప్

గతంలో ఈ మార్కెట్‌లో ఉప్పుడు బియ్యం వ్యాపారం జోరుగా సాగేది. మార్కెట్ చుట్టుపక్కల కూడా ఉప్పుడు బియ్యం ఆడే మిల్లులు అధిక సంఖ్యలో ఉండేవి. కేవలం ఉప్పుడు బియ్యం అమ్మ కాల లోనే ఆదివారం కోట్లలో వ్యాపారం సాగేది. అయితే కాలక్రమేణ ఉప్పుడు బియ్యం అమ్మకాలు తగ్గిపోయాయి. ఫలితంగా మిల్లులు కూడా చాలా మూతబడ్డాయి.

#### ఘనంగా దసరా, సంక్రాంతి వేడుకలు

ఈ మార్కెట్‌లో కేవలం కష్టపడం డబ్బులు సంపాదించడం మాత్రమే కాదు. పండుగలు కూడా వైభవంగా నిర్వహిస్తారు. దీనికి సంబంధించి ఖర్చయిన ప్రతీ రూపాయి కూడా వ్యాపారులు, కార్మికులే ఇస్తుంటారు. దసరా వేడుకలు 9 రోజులు ఈ మార్కెట్ విద్యుద్దీపాల అలంకరణలో మెరిసిపోతూ ఉంటుంది. సంక్రాంతి పండుగ కూడా ఘనంగా నిర్వహిస్తారు

**• తరతరాలుగా ఇక్కడే వ్యాపారం**



మా పూర్వీకుల నుంచి తరతరాలుగా ఈ మార్కెట్‌లోనే వ్యాపారాలు సాగిస్తున్నాం. ఈ మార్కెట్ సంబంధించి దాతలు 11.30 ఎకరాల స్థలాన్ని పట్టణ అభివృద్ధి కోసం కొంత, వ్యాపారాలు చేసుకునే వారికి కొంత స్థలం ఇచ్చారు. అప్పుడు ఈ మార్కెట్‌ని బ్రహ్మానందరెడ్డి అనే గ్రామ పెద్ద ప్రారం భించారు. దీంతో అప్పటి నుంచి కూడా ఇదే పేరుతో ఈ మార్కెట్ జరుగుతోంది. వేలాది మందికి ఉపాధిగా మారింది.

**- గుండుమోగుల సాంబయ్య ,పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు**

**• ఈ మార్కెట్టే మాకు జీవనోపాధి**



ఈ మార్కెట్‌లో పండ్లు, ఉల్లిపాయలు, కూరగాయలు, అపరాలు వంటి అనేక పనుల్లో వేలాది మంది పని చేస్తున్నాం. ఈ మార్కెటే మా అందరికి జీవనోపాధి.. చుట్టుపక్కల పది గ్రామాల నుంచి ఈ మార్కెట్‌లో పనిచేయడానికి వస్తుంటారు. పని ఎక్కువైతే బయట నుంచి కూడా కొంతమంది వచ్చి పనులు చేస్తుంటారు

**- జవ్వాది శ్రీను, సీఐటీయూ పట్టణ ప్రెసిడెంట్**

# విశాఖ ఉక్కు కాపాడుకోవడం చారిత్రక ఘట్టం

**రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు**


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి.. చిత్రంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్

ఏలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వ పటిమతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడం చారిత్రక ఘట్టమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కేంద్రంతో అంటకాగిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చాలాసార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని రక్షించుకోవాలన్న ధ్యాస లేకపోగా, గాలికొదిలేశారని ఆరోపించారు. కేంద్రం మెడలు వంచుతామని ప్రగల్భాలు పలికి, 28 మంది ఎంపీల బలమున్న కనీసం కేంద్రంపై ఒత్తిడి తేలేక, పోరాట పటిమ చూపకుండా అవినీతికే ప్రాధాన్యం ఇవ్వడం వలన స్థాయి దిగజార్చుకున్నారన్నారు. కేంద్రం వదిలించుకోవాలని చూసినా, దానికి తలొగ్గకుండా ఫ్యాక్టరీ కోసం మంత్రి లోకేశ్ సైతం తన వంతు ఉద్యమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఉపసంహరించుకుని రూ.11,440 కోట్లుతో ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ సాధన వెనుక చంద్రబాబు కృషి ఉందన్నారు. అమరావతి నిర్మాణంతో పాటు విశాఖపట్నంలో రూ.2.08లక్షల కోట్లు పెట్టుబడులతో చేపట్టే పలు పనులకు ఇటీవల చంద్రబాబు నాయకత్వంలో మోదీ శంకుస్థాపనలు చేయడం తెలుగు జాతి గర్వించదగ్గ విషయమని అన్నారు. నిజంగా ఈ విషయంలో అందరూ మోదీ, అమిత్‌షా, ఉక్కు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలపాలన్నారు. కార్మికుల పోరాటం వృథా కాలేదని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, టీడీపీ నాయకులు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

# శీతాకాలంలో కోళ్లకు మిక్స్‌డ్ వైరస్

**డీడీ డాక్టర్ జవహర్ హుస్సేన్**

**ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన**

పెంటపాడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : శీతాకాలంలో దేశవాళీ కోళ్లలో మిక్స్‌డ్ వైరస్ వ్యాధులు సోకి మరణాలు సంభవిస్తాయని, వ్యాధి సోకిన కోళ్ల లక్షణాలు కనిపించకుండానే నిమిషాలలో మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని పశుసంవర్ధకశాఖ భీమవరం ఉపసంచాలకు డాక్టర్ జవహర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కోళ్లకు అంతుచిక్కని వైరస్ అనే కథనానికి స్పందించారు. ఈ వైరస్ మనుషుల సంచారం, గాలి, నీరు, కోళ్ల ద్వారా వ్యాపిస్తుందన్నారు. కోళ్లలో ఏదైనా కోడి బలహీనంగా కనపడితే వెంటనే గమనించి ఆ కోడిని మిగతా కోళ్లకు దూరంగా ఉంచాలన్నారు. వైరస్‌ను నివారించే అంటీవైరల్ ఇన్ఫెక్టెంట్ లేదా బయోబస్టార్ పౌడర్‌ను కోడి తాగే నీటిలో ఒక గ్రాము మందు లీటరు నీటిలో కలిపి తాగించాలి. అలాగే 5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి కోళ్లు పెంచే ప్రాంతంలో స్ప్రే చేయాలి. వైరస్‌తో చనిపోయిన కోడిని ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా సక్రమంగా ఖననం చేయాలి. లేదా కాల్చివేయాలి. వ్యాక్సిన్ సోకని కోళ్లకు ఆర్‌డీఎఫ్ 1, ఆర్‌డీకే మరియు పాల్‌పాక్స్ వ్యాక్సిన్లు షెడ్యూల్ ప్రకారం వేయించాలని సూచించారు.

# కాలుష్య నియంత్రణ మనందరి బాధ్యత

**సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో పొల్యూషన్ విపరీతంగా పెరిగిపోయిందని దీనిని అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో పర్యావరణ పరిరక్షణ చట్టంపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కార్యదర్శి రత్న ప్రసాద్ మాట్లాడుతూ పొల్యూషన్ విపరీతంగా పెరగడం వల్ల మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధికారులు పొల్యూషన్ అరికట్టడంలో తీసుకున్న చర్యలకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారాలు అందించేలాగ వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సంబంధిత చట్టాలపైన అధికారులకు అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో ఇటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఘన వ్యర్థ పదార్థాలను సేకరించి విభజించి ఉపయుక్తమైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. అలాగే కర్మాగారాల నుంచి వెలువడే కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికతను ఉపయోగించి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. ఆసుపత్రి నుంచి వెలువడే వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో వాటిని నిర్మూలించాలని సూచించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎప్పటికప్పుడు చెత్త సేకరించి నిర్మూలనకు ప్రతి అధికారి కృషి చేస్తున్నారని అలాగే ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు.

# కళాశాలలో విద్యాధికారి విచారణ


ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సాల్మన్ రాజు

ముదినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 4న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పి.వి. సాల్మన్ రాజు విచారణ జరిపారు. ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆయన కళాశాలలో ప్రిన్సిపాల్ జాస్మిన్‌ను విచారించటంతోపాటు ఆ పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకుల నుంచి కూడ సమాచారం సేకరించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ఆలస్యం కావటం, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆలస్యంగా రావటం, ఆ సమయంలో నాయకుల ప్రశ్నలకు ఆమె సమాధానం అసంతృప్తి కలిగించటం లాంటి విషయాలపై ఇంటర్మీడియట్ విద్యాధికారి సాల్మన్ రాజు ప్రిన్సి పాల్‌తో పాటు లెక్చరర్లను విచారించారు. వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఈ నెల 4న జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌పై పలు ఫిర్యాదులు చేశారు. కళాశాలలో గతంలో 200 మందికిపైగా ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రిన్సిపాల్ వైఖరి వల్ల 70కి పడిపోయిందని చెబుతూ ఆమెను వెంటనే బదిలీ చేయాలని తెలిపారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహణరావు ఫోన్‌లో విచారణాధికారితో కళాశాల పరిపాలన దెబ్బతిందని ఫిర్యాదు చేశారు.

## పీక కోసిన కేసులో ఇద్దరి అరెస్టు

గణపవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం ముగ్గళ్ళ వద్ద ఆదివారం రాత్రి బొడ్డి కృష్ణ అనే వ్యక్తిని పీకకోసిన సంఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు. దువ్వ గ్రామానికి చెందిన బొడ్డి కృష్ణతో వివాహేతర సంబంధం కారణంగానే ఈ సంఘటనకు దారి తీసిందని ఎస్సై తెలిపారు. కృష్ణ పీకకోసిన అదే గ్రామానికి చెందిన గండికోట జానేష్, గండికోట ఏసులను మంగళవారం వరదరాజపురం గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# డేంజర్ బెల్స్



» యువతలోనూ మధుమేహం » వ్యాయామం, నాణ్యమైన ఆహారం తీసుకోవాలి
» ఒత్తిడి లేని జీవితం గడపాలి » వ్యాధిపై అవగాహనతోనే నియంత్రణ సాధ్యం

**ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వేణు**

భీమవరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నేడు యువత కూడా మధుమేహం వ్యాధి బారిన పడుతున్నారు. దీనికి కారణం సరైన వ్యాయామం లేకపోవటం, క్వాలిటీ ఆహారం తీసుకోకపోవటం, జన్యుపరమైన కారణాలు కనిపిస్తున్నాయి. సోమవారం భీమవరంలో నిర్వహించిన మధుమేహ శిబిరంలో దాదాపు 100 మందికి పైగా 30 ఏళ్ళ వయస్సున్నవారు రావటం ఆందోళన కలిగించే విషయం. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. మధుమేహంపై అవగాహన పెంచుకోవాలని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వేణు కవర్తపు తెలిపారు. పూర్వం 50ఏళ్ళ దాటిన వారికి ఈ వ్యాధి కనిపించేది. ఇప్పుడు వయస్సుతో సంబంధంలేకుండా రావటం దురదృష్టకరమని అన్నారు. యుకే- ఇండియా ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూవీ కృష్ణంరాజు మెమోరియల్ ఉచిత మెగా సుగర్ వ్యాధి చికిత్స శిబిరంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మంగళవారం 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఈ సందర్భంగా మధుమేహం, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ఆయన మాటల్లోనే తెలుసుకుందా...



**• మధుమేహ నియంత్రణకు ఏ ఆహారం తీసుకోవాలి ?**

ముఖ్యంగా కార్బోహైడ్రేడ్ ఉండే పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. రైస్‌ఎక్కువగా తిన్నా, గోధుమలతో చేసినవాటిని ఎక్కువ తీసుకున్నా ఇబ్బందే. అన్నం తక్కువగాను, ఎక్కువగా ఆకుకూరలు తీసుకుంటే కొంత రాకుండా ఉంటుంది. ముఖ్యంగా మధుమేహం వ్యాధి జనరక్‌వల్ల, కాలుష్యం వల్ల వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**• మధుమేహం కేసులు పెరగటానికి కారణాలు?**

ప్రతి ఒక్కరికి వ్యాయం తగ్గిపోయింది. శారీరక శ్రమ ఎంతో అవసరం. ఒత్తిడి ఎక్కువగా ఉన్నా ఇబ్బందే. అందువల్ల నడక, యోగా వంటివి చెయ్యాలి. దీని ద్వారా కొంత అరికట్టే అవకాశం ఉంది.

**• మధుమేహం ఉన్నవారికి కాళ్ళకే పుండ్లు ఎందుకు పడతాయి?**

మన శరీరంలో కాళ్ళ నరాలు చాలా పొడవు ఉంటాయి. మెదడు నుంచి వెన్ను పూస దగ్గర నుంచి కిందకు వస్తాయి. ఈ నరాలపై వత్తిడి పెరగటంతోపాటు మధుమేహం వల్ల తొందరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. మోకాళ్ళ వరకు ఇబ్బంది ఉండదు కానీ పాదాల వద్దకు రక్త ప్రసరణ తగ్గటం వల్ల నరాలు దెబ్బతింటాయి. స్పర్శ కోల్పోతారు. దెబ్బ తగిలినా బాధ ఉండదు. దీనితో ఇన్‌ఫెక్షన్ వచ్చి కాలుతీసే ప్రమాదం ఏర్పడుతుంది.

**• కాళ్లు తొలగించకుండా ఎలా చెయ్యవచ్చు?**

కాళ్ళు తొలగించటం వల్ల రోగి జీవితకాలం తగ్గిపోతుంది. నడక తగ్గటం వల్ల ఇతర ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల పుండు వల్ల దెబ్బతిన్న కాళ్లకు ఆపరేషన్ చేసి వంకరను సరిచేసి తొలగించకుండా చెయ్యటం వల్ల రోగి జీవితకాలం పెరిగే అవకాశం ఉంది.

**• కాలు తొలగించకుండా వైద్యం మన దేశంలో ఉందా?**

ఇన్‌ఫెక్షన్ బారిన పడిన కాలు తొలగించకుండా వైద్యం చేసే పరిస్థితి మన దేశంలో ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. తాము ఇక్కడ వైద్యులకు శిక్షణ ఇస్తున్నాం. భీమవరంలో కొంత మంది వైద్యులకు అవగాహన కల్పించాం. చాలా దేశాల్లో ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇందు కోసం ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అసోసియేషన్ కృషి చేస్తోంది. తాము కాలు తొలగించకుండా ఫుట్ ఆపరేషన్ చేసి మందులతో నయం చేస్తున్నాం. రోగిని నడిపిస్తున్నాం.

**• పుండ్లు పడినవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

కాళ్లకు తప్పని సరిగా చెప్పులు ధరించాలి. వీరి కోసం ప్రత్యేకంగా తయారుచేసినవాటిని వాడటం వల్ల ప్రయోజనం ఉంటుంది. పాదాలకు దెబ్బలు తగలకుండా చూసుకోవాలి. స్పర్శ లేనట్లుగా గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మందులను సమయానికి వేసుకోవాలి. మిత ఆహారం తీసుకుంటే మంచిది.

**• మందు బిళ్లలు, ఇన్సులిన్ లేకుండా చికిత్స ఉందా?**

ప్రస్తుతం నోటిలో స్ప్రే చేసుకునే మందు ఒకటి అందుబాటులోకి వస్తోంది. మన దేశంలో పరీక్షల దశలో ఉంది. త్వరలో అందుబాటులోకి రావటం వల్ల కొంత ఉపయోగంగా ఉంటుంది.

# పంచాయతీల్లో శాటిలైట్, మోడల్, బేసిక్, ఫౌండేషన్, హైస్కూళ్లు

**నేటి నుంచి రెండురోజులపాటు అన్ని పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తనిఖీలు**
**ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలను ఒప్పించండి**
**సర్‌ప్లస్ టీచర్లకు సమీప మండలాల్లోనే సర్దుబాటు**
**ఉమ్మడిజిల్లా ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో పాఠశాల విద్య డైరెక్టర్ సమావేశం**


హాజరైన ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఇతర అధికారులు

ఏలూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పేదపిల్లల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీల్లో ఏర్పాటు చేయతలపెట్టిన మోడల్ ప్రైమరీ స్కూళ్ళ సంఖ్యను ఖరారు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయకుమార్‌రాజు ఆదేశించారు. ప్రస్తుతం వున్న ఆరు పాఠశాలల విధానంస్థానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు చేయనున్న ఐదు రకాల పాఠశాలలను ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో ఏర్పాటు చేయడానికి కార్యాచరణపై మంగళవారం ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఏకబికిన రాత్రి 7.30 గంటలవరకు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో డైరెక్టర్ విజయ కుమార్ రాజు ఓ మెంటార్‌లా వ్యవహరించి, నేరుగా ఎంఈవోలు, హెచ్‌ఎంల వద్దకే వెళ్ళి ఐదు రకాల బడులు, జీవో 117 రద్దు, ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వ విధానాలను తెలియజేసి, వాటిపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి రెండుజిల్లాల కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణిలతోపాటు, ఆర్డీవోలు, డీఈవోలు, అసెంబ్లీ నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, డీఆర్డీయే పీడీ, నోడల్ ఆఫీసర్లు సర్వేశ్వరరావు, శ్రీనివాస్, కాకినాడ ఆర్జేడీ, డీవైఈవోలు, అసిస్టెంట్ డైరెక్టర్లు, సూపరింటెండెంట్లు, తదితరులు హాజరయ్యారు. డైరెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలవారీగా విద్యార్థుల సంఖ్యను ఖచ్చితంగా నిర్ధారించేందుకుగాను 'డైస్' డేటాను ఇప్పటికే నిలిపివేశామని, ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా ఎంఈవోలందరూ బుధ, గురువారాల్లో తమ పరిధిల్లోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ స్వయంగా తనిఖీచేసి, తరగతుల వారీగా భౌతికంగా విద్యార్థుల హాజరును తీసుకుని ఎన్‌రోల్‌మెంట్‌ను తేల్చాలని ఆదేశించారు. ఈ డేటాను తాను స్వయంగా పరిశీలించిన తర్వాతే తుది వివరాలను ఎంఈవోలకు అందజేస్తానని, ఆ తర్వాతే నియోజకవర్గాలవారీగా పంచాయతీల్లో ఏర్పాటయ్యే శాటిలైట్, మోడల్, బేసిక్, ఫౌండేషన్, హైస్కూళ్ళ స్వరూపంపై సంబంధిత ఎమ్మెల్యేలకు తెలియజేయాలని సూచించారు. కొత్తవిధానంలో ప్రారంభించే పాఠశాలలకు ఇప్పటికిప్పుడే మౌలికవసతులు, నిధులను సమకూర్చలేమని, అందుబాటులోవున్న వాటినే సమర్థవంతంగా వినియోగించుకుంటామని వివరించారు.

**టీచర్లకు మిగులు భయాందోళనలు వద్దు**

కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఐదు రకాల పాఠశాలల వల్ల క్షేత్రస్థాయిలో పాఠశాలల సంఖ్య భారీగా కుదింపు జరుగుతుందని, దీనివల్ల పెద్ద సంఖ్యలో మిగులు(సర్‌ప్లస్) ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారనే వెల్లువెత్తుతోన్న భయాందోళనలపై స్పష్టతనిచ్చారు. జీవో 117 ఉత్తర్వులను రద్దు చేసినప్పటికీ, ప్రత్యామ్నాయంగా చేపడుతున్న చర్యల్లో భాగంగా సర్‌ప్లస్ టీచర్లందరినీ సమీప మండలాలలకే సర్దుబాటు చేస్తామని భరోసా ఇచ్చారు. నూతన పాఠశాలల విధానంపై ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయసంఘాలను ఒప్పించే బాధ్యత ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలదేనని స్పష్టం చేశారు. ప్రతిపాదిత పాఠశాలలపై ఏప్రిల్ నెలాఖరునాటికి కార్యాచరణ పూర్తికావాలని, ఆ వెంటనే టీచర్ల బదిలీలు చేపడతామన్నారు.

**పిల్లలకు హైవేలు, చెరువుల అడ్డంకులు లేకుండా చూడాలి**

పంచాయతీ పరిధిలో మోడల్ ప్రైమరీ స్కూలులో మిగతా పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేసిన అనంతరం, వాటి స్థానాల్లో 1, 2 తరగతులతో వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో ఫౌండేషన్ ప్రైమరీ స్కూళ్ళను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ సూచించారు. ప్రస్తుతం చదువుతున్న ప్రాథమిక పాఠశాల నుంచి మోడల్ ప్రైమరీ స్కూలుకు చేరుకునేందుకు విద్యార్థులకు హైవేలు, చెరువులు వంటి అడ్డంకులతో రవాణా సదుపాయం లేనిచోట మాత్రమే 1నుంచి 5వ తరగతి వరకు ఉండేలా బేసిక్ ప్రైమరీ స్కూళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. నూతన విద్యా విధానంలో క్లస్టర్‌లతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ప్రత్యేక పర్యవేక్షణ చేయడం వీలవుతుందన్నారు. స్థానికంగా ఎదురయ్యే సమస్యలను కలెక్టర్లదృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలన్నారు. నమూనాగా ఉమ్మడి జిల్లాలో కొత్త పాఠశాలల విధానంపై ఇరగవరం, పెదపాడు మండలాల ఎంఈవోలు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా డైరెక్టర్‌కు వివరించారు.

## క్రైమ్ కార్నర్

**వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు**

### ఇద్దరు యువకుల మృతి

అత్తిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బల్లిపాడు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందినట్లు అత్తిలి పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన తోట అజయ్‌సాయి (23) మోటారు సైకిల్‌పై వేగంగా వెళుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన అజయ్‌సాయిను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అత్తిలి ఎస్‌ఐ పి ప్రేమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మొగల్తూరు:** పాలకొల్లుకు చెందిన సేగు కోదండ కృష్ణ నాగ సునీల్ (24) సోమవారం తన అత్తవారి ఇంటికి కాళీపట్నం వెళ్ళేందుకు పాలకొల్లు నుంచి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో మోటార్‌బైక్ కొత్తోట జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగామంగళవారం మృతి చెందాడు. ఈఘటనపై మృతుని తండ్రి వీర వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగలక్ష్మి తెలిపారు.

### ఇద్దరు డ్రైవర్లకు జైలు, జరిమానా

చింతలపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో రెండు వాహనాలు ఢీకొన్న కేసులో ఇరువురికి ఏడాది జైలు, రూ.6వేలు చొప్పున జరిమానా విధిస్తూ చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు మంగళవారం నాడు తీర్పు చెప్పారు. 2018లో గణిజెర్ల గ్రామానికి చెందిన పింగుల వెంకటేశ్వరరావు వ్యాన్‌తోను, పెదవేగి మండలం రామసింగవరం గ్రామానికి చెందిన సూరిసెట్టి సుబ్బారావు ట్రాక్టర్‌తో తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఓ మహిళ మృతి చెందగా మరో పది మంది మహిళలకు గాయాలయ్యాయి. నిందితలపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష పడింది.

# శ్మశాన వాటికలో చెట్ల తొలగింపు

**అడ్డుకున్న మునిసిపల్ అధికారులు**

**రోడ్డుపై బైఠాయించిన దళితులు**


తణుకు- ఇరగవరం రోడ్డులో రాస్తారోకో చేస్తున్న ఎస్సీలు

తణుకు రూరల్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలోని ఎస్సీ శ్మశాన వాటికలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, వృక్షాల తొలగింపులో ఏర్పడిన వివాదం దళితులు, మునిసిపల్, పోలీసుల మధ్య వివాదంగా మారింది. పట్టణంలోని 11, 12, 13 వార్డులలో నివసించే ఎస్సీ యువకులు జైభీమ్ యూత్ కమిటీగా ఏర్పడి తమ ప్రాంత శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దానిలో భాగంగా కొద్ది రోజుల క్రితం మునిసిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈనేపథ్యంలో ఈనెల 20వ తేదీ నుంచి జైభీమ్ యూత్ సభ్యులు శ్మశానంలో పిచ్చి మొక్కలతో పాటు వృక్షాలు కూల్చి వేసి నరికిన చెట్లను ట్రాక్టర్‌లతో తొలగిస్తుండటంతో మునిసిపల్ అధికారులు జోక్యం చేసుకున్నారు. మంగళవారం మునిసిపల్ అధికారులు శ్మశాన వాటిక వద్దకు వెళ్లి పెద్ద వృక్షాలను వేలం వేసి తొలగించాలని, వచ్చిన ఆదాయాన్ని శ్మశాన వాటిక అభివృద్ధికి ఉపయోగించాలి కాబట్టి పెద్ద వృక్షాలను తొలగించవద్దని జైభీమ్ సభ్యులను కోరారు. దీనితో తాము మున్సిపల్ కమిషనర్‌ను కలసి చెప్పిన తర్వాతే తొలగింపు చేపట్టా మని ఇప్పుడు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నిస్తూ తణుకు ఇరగవరం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద టెంట్ వేసే క్రమంలో పోలీసులకు, ఎస్సీలకు వాగ్వాదం ఏర్పడింది. ఎస్సీలు ధర్నా, దీక్షలకు దిగారు. పోలీసులు, దళితుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను వివరణ కోరగా శ్మశాన వాటికలో మొక్కలను తొలగించేందుకు జైభీమ్ యూత్ సభ్యులకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

## బాలికను వేధిస్తున్న బాలుడిపై పోక్సో కేసు నమోదు

పెదవేగి, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో చదువుతున్న బాలికను అదే పాఠశాలలో చదువుతున్న బాలుడు ప్రేమించాలంటూ వేధిస్తున్న సంఘటనలో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఓ గ్రామంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికను అదే పాఠశాలలో చదువుతున్న బాలుడు ప్రేమించాలంటూ కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ విషయమై బాలిక ఫిర్యాదు మేరకు పెద్దలు బాలుడిని మందలించినప్పటికీ ఆ బాలుడిలో మార్పురాకపోగా వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దీంతోపాటు ఆ బాలుడు అల్లరి, చిల్లరిగా తిరుగుతూ పాఠశాలలో కూడా ఆకతాయి పనులకు పాల్పడుతుండడంతో నెలరోజుల కిందట టీసీ ఇచ్చి పంపించేశారు. సోమవారం సాయంత్రం పాఠశాలకు వెళ్ళిన ఆ బాలుడు.. ప్రేమించాలంటూ బాలికపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బాలుడిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

## దొంగ అరెస్టు



ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సెలవులకు తాళాలు వేసి ఊరు వెళ్ళి వచ్చేటప్పటికి దొంగ ఆ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు. ఏలూరు పావులదిబ్బ ప్రాంతానికి చెందిన మింగి దుర్గా ప్రసాద్ ఈనెల 15వ తేదీన ఏలూరు టూటౌన్ ప్రాంతంలో ఒక ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని లక్ష రూపాయల నగదు అపహరించాడు. ఈ సంఘటనపై బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీసీ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన నిందితుడు మింగి దుర్గా ప్రసాద్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు.

## సమస్య పరిష్కరించలేదని ఆత్మహత్యకు బెదిరింపు

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణపురం గ్రామానికి చెందిన కొర్రపాటి లక్ష్మణరావు (27) ఈనెల 20వ తేదీన ఏలూరు కలెక్టరేట్‌కు వచ్చాడు. అక్కడ అధికారుల వద్దకు తన గ్రామంలో ఒక వ్యక్తి తనను వేధిస్తున్నాడని రెండేళ్ళ నుంచి తనపై దాడికి పాల్పడ్డాడని ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులు ఇప్పటి వరకూ పరిష్కరించలేదని పేర్కొన్నాడు. ఈ వేధింపులు భరించలేనని అప్పటికప్పుడు తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను తనపై పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో కలెక్టర్ అధికారులు జోక్యం చేసుకోవాలని ఆదేశించారు. అయినప్పటికి అతను అధికారుల మాట వినకుండా పెట్రోల్‌తో బెదిరింపులు చేపట్టడంతో చివరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులు ఈ సంఘటనపై సోమవారం అర్ధరాత్రి తరువాత కేసు నమోదు చేశారు.

## గేదెల అక్రమ రవాణాపై కేసు

తణుకు రూరల్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి) ఈనెల 20వ తేదీన రెండు వ్యాన్‌లలో 10 గేదెలను తరలిస్తున్నట్లు గో సేవా సమితి సభ్యుల ఫిర్యాదు మేరకు గేదెలను హింసిస్తూ తరలిస్తున్న ఇద్దరు వ్యాన్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ సీఐ కృష్ణ కుమార్ తెలిపారు. వ్యాన్‌లలో తరలిస్తున్న గేదెల ఆరోగ్య పరిస్థితిపై పశువైద్యుల పరీక్షల అనంతరం చర్యలపై ఎస్‌ఐ చంద్రశేఖర్ కోర్టుకు నివేదిక అందజేస్తారని తెలిపారు.

## డ్రైవర్లకు కంటి పరీక్షలు

భీమవరం క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు కంటిచూపు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని భీమవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. వెంకటరమణ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం భీమవరం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో కళాశాల బస్సుల డ్రైవర్లు, హెవీ గూడ్స్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. 135 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించగా అందులో 76 మందికి కళ్ళజోళ్ళను జగదీష్ మెరైన్ ఉచితంగా అందించనుంది. అలాగే బీపీ పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

**అత్తిలి:** అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 145 మందిని పరీక్షించారు. క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో అనూషా డయాగ్నోస్టిక్ అధినేత యు. సంగమేశ్వరరావు సహకారం అందించారు.

## రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 23న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్, స్త్రీలు, చిన్నపిల్లలు, క్యాన్సర్, సంతాన సాఫల్యత, గుండె వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఈకో, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌తో పాటూ అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుష్ఠు వ్యాధి పై ఇంటింటా సర్వే.

గణపవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు అంటువ్యాధి కాదని ప్రతి ఒక్కరూ ప్రేమతో చేయుతనివ్వాలని గణపవరం ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్ నాయుడు, కిరణ్మయి కోరారు. మంగళవారం గణపవరంలో కుష్ఠుపై ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటిని ఆశా, ఏఎన్ఎంలు సందర్శించి అనుమానిత కేసులను పీహెచ్‌సీలకు రిఫర్ చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులకు మందులు ఉచితంగా ఇస్తారని వారు తెలిపారు.

## స్టడీ మెటీరియల్ వితరణ

గణపవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులో విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభను చాటాలని తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పడాల ట్రస్ట్ సీఈఓ పడాల సూర్యప్రసాద్ అన్నారు. గణపవరంలోని చింతలపాటి సూరయ్య బాలికల హైస్కూల్‌లో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, క్రీడాసామాగ్రిని ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రీజియన్ కో ఆర్డినేటర్ ఉమామహేష్, వివేనానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు, హెచ్ఎం బాలభాస్కరం పాల్గొన్నారు.

## 6 నెలల పిల్లలకు ఆధార్ తప్పని సరి

నరసాపురం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్నెల్ల పిల్లలందరికీ ఆధార్ నమోదు చేయాలని డీఎల్‌డీవో ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్, సర్వే, ఆన్‌లైన్ యాప్‌ల పురోగతిపై కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో చిట్టవరం, రుస్తుంబాదా, తూర్పుతాళ్ళు, లిఖితపూడి గ్రామాల్లో ఆధార్ సీడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కొప్పర్రు ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

**కాళ్ళ:** సున్నా నుంచి ఆరేళ్ళలోపు వయస్సు గల పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఆధార్ మొబైల్ క్యాంప్‌లను సద్వినియోగపరచుకోవాలని కాళ్ళ ఎంపీడీవో జి.స్వాతి తెలిపారు. కాళ్ళ మండలంలో మూడుచోట్ల ఆధార్ మొబైల్ క్యాంప్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె మంగళవారం తెలిపారు. ఎనిమిది రోజులపాటు ఈ శిబిరాలను నిర్వహిస్తామన్నారు.

## గురుకుల పాఠశాల సామాజిక తనిఖీ

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెదతాడేపల్లి గురుకుల పాఠశాలను రిసోర్స్ పర్సన్లు బి. యోగానంద్, జి. చంద్రబాబు సామాజిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ రాజారావుతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల బ్యాండ్ ట్రూప్ విద్యార్థులను అభినందించారు.

## అర్హులకు పింఛన్లు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మంచానికి పరిమితమైన అర్హులందరికీ ప్రభుత్వం అందించే రూ.15వేల పింఛన్‌లు అందుతాయని ఎంపీడీవో ఎం. విశ్వనాథ్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో మంచానికి పరిమితమైన 54 మంది పింఛన్ దారులను రాష్ట్ర వైద్యుల బృందం మంగళవారం పరిశీలించింది. వైద్యులు జి రవికుమార్, ఎస్ రాఘవేంద్ర సాయి తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలకు కంప్యూటర్ బహూకరణ

తణుకు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తణుకు మానవత ఆధ్వర్యంలో ఎస్.ఎస్.వి.టి జూనియర్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌కు అమెరికన్ టెలిఫోన్, టెలికమ్యూనికేషన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ విద్యార్థులకు ఉపయోగపడేలా బహూకరించిన కంప్యూటర్‌ను మానవత శాంతి ర్యాలీ జిల్లా కమిటీ చైర్మన్ గమిని రాంబాబు ప్రిన్సిపాల్ తులసికి అందజేశారు.

## వీఆర్వో డేవిడ్‌రాజు హఠాన్మరణం



నరసాపురం రూరల్/మొగల్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామ వీఆర్వో పి. డేవిడ్‌రాజు(57) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం విధులు నిర్వహిస్తుండగా సచివాలయంలో ఆయన కుప్పకూలారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన పార్థివదేహాన్ని ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు సందర్శించి నివాళులర్పించారు. మొగల్తూరుకు చెందిన డేవిడ్ రాజు మొగల్తూరు రెవెన్యూ కార్యాలయంలోనే సుదీర్ఘకాలం విధులు నిర్వహించారు. ఇటీవల మండలంలోని పాతపాడు గ్రామం నుంచి మూడు నెలల క్రితం నరసాపురం మండలం తూర్పుతాళ్ళుకు బదిలీపై వెళ్ళారు.

## 25 వరకు ఉపకార వేతనాలకు గడువు

పాలకొల్లు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాపు, తెలగ, బలిజ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను ఫిబ్రవరి 9న అందించనున్నట్టు కన్వీనర్ వంగా నరసింహారావు తెలిపారు. విద్యార్థులు జనవరి 25వ తేదీ లోపుగా ధరఖాస్తులు అందించాలని ఆయన తెలిపారు. శ్రీతులసీ రామ చంద్రప్రభ (గుంటూరు), పాలకొల్లు శ్రీ కృష్ణ దేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో అందజేసే ఉపకార వేతనాలకు సంబంధించిన ధరఖాస్తులను పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్‌లోని ముచ్చర్ల శ్రీరామ్ గెస్ట్ హౌస్ వద్ద, రైల్వే గేటు సమీపంలోని చవాకుల చారిటబుల్ ట్రస్ట్ వద్ద నుండి పొందవచ్చునని, మరిన్ని వివరాలకు చవాకుల నరేష్ బాబు, కో కన్వీనర్ 94943 37711ను సంప్రదించాలన్నారు.

# రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన ఘనత వైసీపీదే

### ఎమ్మెల్యే ఆరిమిల్లి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్ర ప్రయోజనాలు కన్నా స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు 11వేల440కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాలు క్యాబినెట్ ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. విశాఖ ఉక్కును ప్రవేటు పరం చేయాలని, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్ రెడ్డి ప్రయత్నిస్తే విశాఖ ఉక్కును ఏ విధంగా పరిరక్షించాలని చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. వైసీపీ అసత్య ప్రచారాలను ప్రజలు వినే పరిస్థితుల్లో లేరని తెలిపారు. నిధులు విడుదలకు ప్రయత్నించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

### నమ్మకం పెంచేలా పాలన : బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం రూరల్:** రాష్ట్రాభివృద్ధిపై నమ్మకం కలిగించేలా కూటమి పాలన సాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని వెంకట్రామన్నగూడెంలో ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మత్స్యకార సొసైటీలు నిర్వహించే మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో నాణ్యమైన చేపలు అందించే విధంగా నియోజకవర్గంలోని 12 చెరువులకు 6 లక్షల చేప పిల్లలు అందించడం హర్షణీయమన్నారు. వాటితోపాటు టూ వీలర్స్, ట్రాన్స్‌పోర్టు వాహనాలు సబ్సిడీతో ఇస్తుందని వివరించారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విదేశాలకు ఎగుమతి చేసే విధంగా మన చేపలకు డిమాండ్ పెరిగే వీలుందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకార సంఘాలకు అనేక రకాలుగా ఊతమిస్తోంద న్నారు. ముందుగా చేప పిల్లలు చెరువులో వదిలారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మైలా వసంతరావు, ఉపాధ్యక్షుడు డి. బాలాజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

**రక్తదానం అభినందనీయం**

రక్తదానం అభినందనీయమని బొలిశెట్టి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీ నుంచి రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.లక్ష చెక్కును అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో రూ. 6.50 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను బొలిశెట్టి పరిశీలించారు.



శ్యామలాదేవిని సత్కరించిన దృశ్యం

## కృష్ణంరాజు సతీమణికి సత్కారం

భీమవరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిని స్వచ్ఛంద సంస్థ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, డీటీడీసీ బాబు, లయన్స్ కృష్ణంరాజు సత్కరించారు. ఉచిత మెగా షుగర్ మెడికల్ క్యాంప్ తో శ్యామలాదేవి, వారి కుటుంబ సభ్యులు అందించిన సేవలు అద్వితీయమని అన్నారు. శ్యామలాదేవి మాట్లాడుతూ భీమవరంలో తలపెట్టిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించారని, లండన్ వైద్యులు, అబుదాబి, హైదరాబాద్ వైద్యులతో రెండో రోజు 20 మందికి చికిత్సలు భీమవరంలో అందిస్తున్నామని, భవిష్యత్ లో కూడా ఇటువంటి వైద్య శిబిరాలను భీమవరం చుట్టు పక్కల ప్రాంతాలలో నిర్వహిస్తామని అన్నారు.

# రోగులకు మెరుగైన సేవలందాలి : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న డయాలసిస్ సెంటర్‌ను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకుంటున్నందున రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందే లావిధంగా చూడాలని వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. డయాలసిస్ సెంటర్‌కు మంచినీటి సమస్యలు ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులు మంత్రి దృష్టికి తేవడంతో సమస్య లేకుండా చూడాలని కమిషనర్‌ను ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన రూ. 12.60 కోట్లు నిధులతో చేపట్టిన ఆసుపత్రి కొత్త భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి, పనులు సత్వరమే పూర్తి చేయాలని సూచించారు వైద్యాధికారులతో పాటు మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్‌డివో దాసి రాజు, కమిషనర్ విజయసారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. 27వ వార్డులోని క్రిస్టియన్ శ్మశాన వాటిక, బీవీ రాజు, ఎన్టీఆర్ కళాక్షేత్రం, రామగుండం పార్కు, అబ్దుల్ కలాం హెల్త్ పార్కు, హిందూ శ్మశాన వాటిక పనులు పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**పోడూరు:** మండలంలోని వేడంగి, కొమ్ముచిక్కాల గ్రామాల్లో రూ.5 కోట్లుతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైన్లు, మంచినీటి పథకాలను మంగళవారం రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ధరఖాస్తులను స్వీకరించారు. శంకుస్థాపన కార్యక్రమాలకు మంత్రి నిమ్మల మోటారు సైకిల్ నడుపుతూ వీధివీధినా ఆగుతూ ప్రజలతో మమేకమై యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, సర్పంచులు చెల్లబోయిన పద్మపార్వతీ శారద, గుంటూరి రామకృష్ణం రాజు, నాయకులు గొట్టుముక్కల రఘురామరాజు, కొసన అబ్బులు, నాగరాజు కృష్ణంరాజు చిన్నా, గుంటూరి రాజా దాసరి రత్నరాజు, బొక్కా నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.



దయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల



అవార్డు అందుకుంటున్న అక్కినేని కృష్ణకిషోర్

## అక్కినేని కృష్ణకిషోర్‌కు పురస్కారం

భీమవరం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విశిష్ట విద్యావేత్త అక్కినేని కృష్ణ కిషోర్‌కు రెబల్ స్టార్ కృష్ణంరాజు ప్రతిభా పురస్కార్ అవార్డు-2025 లభించింది. విద్యారంగానికి చేసిన విశేష కృషికి గాను అక్కినేని కృష్ణ కిషోర్‌కు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. ఈ అవార్డు ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో అందించారు. ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, గజల్ శ్రీనివాస్, సినీ నటుడు గౌతమ్ రాజు, రుద్రరాజు పద్మనాభ రాజు సహా ప్రముఖులు హాజరయ్యారు. ఎఫ్‌టీపీసీ, తెలుగు సినిమా వేదిక, ప్రముఖులకు అక్కినేని కృష్ణకిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణ కిషోర్ ను పలువురు అభినందించారు.

# ఆక్వా చెరువులకు అనుమతులెలా ఇస్తున్నారు?

### అధికారులను నిలదీసిన ఎంపీటీసీలు

### వాడీవేడిగా మండలపరిషత్ సమావేశం

ఉండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థుల శాతం అదే పెరుగుతుందని పలువురు ఎంపీటీసీలు అన్నారు. మంగళవారం ఉండి మండల పరిషత్ సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన జరిగింది. పాములపర్రు ఎంపీటీసీ యడవల్లి వెంకటేశ్వరరావు, ఉప్పులూరు ఎంపీటీసీ నిమ్మల బాలు మాట్లాడుతూ విద్యాశాఖ మండలంలోని ఆయా పాఠశాలలను పర్యవేక్షించి లోపాలు, సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళతామని హెచ్ఎం ముక్కు సత్యనారాయణ వివరించారు. ఆక్వా చెరువులకు అధికారులు ఏ విధంగా అనుమతులు ఇస్తున్నారో చెప్పాలని పలువురు ఎంపీటీసీలు మండల పరిషత్ సమావేశంలో ప్రశ్నించారు. బొండాడ డ్రెయిన్ గట్లు ఆక్రమణలకు గురికావడంపై అధికారులపై మండిపడ్డారు. డ్రెయినేజీ ఏఈ జయప్రకాశ్ మాట్లాడుతూ తమ శాఖకు సంబంధించి ఎవరు అనుమతులు తీసుకోలేదని, ఆక్రమణపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. మత్స్యశాఖ అధికారి రాంబాబు మాట్లాడుతూ ఆక్వాజోన్ పరిధిలో వున్న వాటికి అనుమతులు ఇచ్చామన్నారు. ఒక దశలో మత్స్యశాఖ అధికారి రాంబాబు.. డ్రెయినేజీ ఏఈ జయప్రకాశ్ తీవ్ర వాగ్వాదానికి దిగగా ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు కలుగజేసుకుని సమావేశం దృష్టికి వచ్చిన విషయాలను ఆయా శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకుని పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీవో రవీంద్ర, తహసీల్దారు నాగార్జున, సర్పంచ్‌లు కొండవీటి సాంబశివరావు, దాసరి వెంకటకృష్ణ, ఎంపీటీసీలు రుద్రరాజు యువరాజు, కునుకు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఇందుకూరి



డిప్యూటీ సీఎం పవన్‌తో కొత్తపల్లి

## 'ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి'

నరసాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను మంగళవారం ఆమరావతిలో కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు కలిశారు. దాదాపు అరగంట పాటు పలు అంశాలపై చర్చించారు. కాపు కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలపై పవన్ అరా తీశారు. అర్హులైన పేదకాపులందరికీ రుణాలు అందించేలా సీఎంతో చర్చిస్తానని పవన్ హామీ ఇచ్చినట్లు కొత్తపల్లి చెప్పారు. ప్రభుత్వానికి, కార్పొరేషన్‌కు మంచిపేరు తెచ్చేలా పని చేయాలని పవన్ కోరినట్లు కొత్తపల్లి చెప్పారు.



బోడపాడులో వరిపంట పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

## రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించాలి

పెంటపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని అప్పుడే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మకాలు జరుపుకునేందుకు అర్హులని ఏడీఏ మురళీకృష్ణ, ఏవో పార్థసారథి అన్నారు. మంగళవారం బోడపాడు, అలంపురం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి మాట్లాడుతూ పొలాల్లో ఆకుముడత తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని, నివారణకు ఎకరాకి 200 ఎంఎల్ వేపనూనె లేదా 200 ఎంఎల్ క్లోరిఫైరిపాస్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈవో భాగ్యరత్నం, వీఏఏలు శ్యాంబాబు, దివ్య పాల్గొన్నారు.

## మొబైల్ దొంగకు 6 నెలల జైలు

భీమవరం క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఒకటవ పట్టణంలో మొబైల్‌ను దొంగిలించి పట్టుబడిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు వివరాల ప్రకారం వీరమ్మ పార్క్ వద్ద నడిచి వెళ్తున్న రాజ్‌కుమార్ అనే వ్యక్తిని బెదిరించి మొబైల్ ఫోన్‌ను లాక్కున్న తణుకుకు చెందిన దినకరన్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అప్పట్లో కేసు నమోదైంది. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ భీమవరం సెకండ్ ఏజె ఎఫ్‌సిఎం మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పు ఇచ్చినట్లుగా సిఐ తెలిపారు.



పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

## స్టీల్ ప్లాంట్‌కు మోదీ జవసత్వాలు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర మంత్రులు కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాస వర్మ చిత్రపటాలకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వలవల బాబ్జి, బీజేపి కన్వీనర్ ఈతకోట తాతాజీలు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉక్కుకు కొత్త ఊపిరి : పొత్తూరి

నరసాపురం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కుకు కేంద్రం రూ. 11,440 కోట్ల సాయాన్ని అందించిందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకే ప్రయత్నించిందన్నారు. జక్కం శ్రీమన్నారాయణ, అధికారి అనంతరామారావు, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, పి. నాగబాబు, పాలూరి బాబ్జి, భాస్కర్, పాపారావులు పాల్గొన్నారు.

## మూసివేతకు వైసీపీ కుట్ర : మంతెన

భీమవరం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ మూసివేయాలని కేంద్ర ప్రభుత్వానికి తెలిపారని పార్లమెంట్‌లో అప్పటి కేంద్ర మంత్రి ప్రకటించడంతో వైసీపీ కుట్ర బహిర్గతమైందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీని ప్రకటించడంపై అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతుండగా వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలను చేస్తున్నారని విమర్శించారు.



ముక్కే హారికకు సత్కారం

## బాల వ్యాకరణ అవధానం భేష్

పెనుగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బాల వ్యాకరణం మూల సూత్రాల ధారణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. మంగళవారం పెనుగొండలోని ఎస్‌వీకేపీ కళాశాలలో పోడూరు మండలం మినిమించిలిపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ముక్కే హారికతో బాల వ్యాకరణ అవధానం నిర్వహించారు. సహ స్రావధాని డాక్టర్ కడిమెళ్ళ వర ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో ఇది గొప్ప ఘట్టమని అభివర్ణించారు. నేటి వరకు 1100 అవధానాలు చేశానని తన చేత మొట్టమొదటి అవధానం ఈ కళాశాలలో 1978లో చేశానన్నారు. తనలాగే ఉన్న హారిక ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కళాశాల అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు మాట్లాడుతూ హారిక భవిష్యత్తులో విద్యాభ్యాసానికి సహకరిస్తామన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ పెనుమత్స వెంకట సుబ్రహ్మణ్యం రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలి

మొగల్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ ఆదేశించారు. కేపీ పాలెంలో మంగళవారం రీసర్వే చేపట్టారు. గ్రామస్థులు, రైతులు స్థలం వివాదంలో ఉన్నవారు రీ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

## వ్యక్తిగత శుభ్రత పాటించాలి

తణుకు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలను నివారించవచ్చని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలో ఇంటింటి వెళ్లి దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కలగజేసారు.

## వైభవంగా ప్రభ ఉత్సవం



భీమవరంటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీ ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి పోలేరమ్మ జాతర మహోత్స వాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం రజక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారు ప్రభ మహోత్సవ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వేంద్ర వెంకటస్వామి, తదితర బొక్కవారి పాలెం పెద్దలు విచ్చేసి అమ్మవారికి ధూప దీపం నైవేద్యాల సమర్పించారు. ఈ సందర్భం గా వేంద్ర వెంకటస్వామి మాట్లాడుతూ 23వతేదిన మహా జాతర, 26న అఖండ అన్న సమారాధన ను జయప్రదం చేయాలని కోరారు.





గంటా త్రిమూర్తులకు శాశ్వత సభ్యత్వ పత్రాన్ని అందిస్తున్న తోట సీతారామలక్ష్మి

## గంటాకు టీడీపీ శాశ్వత సభ్యత్వం

భీమవరం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కృష్ణ బలిజ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు, బీసీ నాయకుడు గంటా త్రిమూర్తులు పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి సమక్షంలో టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. భీమవరం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో రూ. లక్ష చెల్లించగా తోట సీతారామలక్ష్మి శాశ్వత సభ్యత్వ రసీదును అందజేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి సీనియర్ నాయకుడు గంటా త్రిమూర్తులు బడుగు బలహీన వర్గాల వారికి విద్య వైద్యం కోసం అనేక విధాలుగా సహాయపడుతుంటారని, వారు ఈరోజు శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమన్నారు.



## మావుళ్ళమ్మ ఆలయానికి విరాళం

భీమవరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన చింతలపాటి సుభాస్ చంద్ర బోసు రాజు రూ. 50 వేలు అందజేశారు. దాత అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

## ఎస్‌కేఎస్‌డీకి ఐఎస్ఓ సర్టిఫికెట్

తణుకు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించినట్లు ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయి తెలిపారు. కళాశాలను పరిశీలించిన బృందం పరిశుభ్రతపై సర్టిఫికెట్ అందజేసిందన్నారు. చిట్టూరి సత్య ఉషారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా మారుతీ కృష్ణ



పెనుమంట్ర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్ష ఎన్నికలో ఏకగ్రీవంగా గోపరాజు మారుతీ కృష్ణ (రవి)ని పెనుమంట్ర మండల అధ్యక్షుడిగా నియమించినట్టు ఆచంట అసెంబ్లీ కన్వీనర్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలో బీజేపీని మరింత పటిష్ట పరిచేలా కృషి చేస్తానని మారుతీ కృష్ణ చెప్పారు. అందరిని కలుపుకుని పార్టీని ముందుకు తీసుకువెళ్తానని అన్నారు.

## కులగణన అభ్యంతరాల గడువు పెంచాలి

పెనుగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ఎస్సీఎస్టీ కులగణనకు సంబంధించిన వివరాలు వెల్లడి చేయడంలో సచివాలయాలు వైఫల్యం చెందాయని ఏపీ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కప్పల రత్నరాజు అన్నారు. మంగళవారం పెనుగొండలో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కులగణనలో వివిధ రూపాల్లో వ్యక్తమైన అభ్యంతరాలు సవరణలకు గడువు పొడిగించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా, సీటీయు నాయకులు నీలాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

## పశువులను గోశాలకు తరలించాలి

ఆకివీడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రహదారిపై ప్రమాదాలకు కారణమవుతున్న ఆవులు, ఎద్దులను ద్వారకా తిరుమలలోని గోశాలకు తరలించాలని హైందవ శంఖారావం సభ్యుడు భమిడిపాటి సూర్యభాస్కరరావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో డి.సుహాసినికి వినతి పత్రం అందచేసి మాట్లాడారు. పట్టణ పరిధిలో జాతీయ రహదారిపై మందలు మందలుగా ఉంటూ వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నాయన్నారు. అంతే కాకుండా అప్పుడప్పుడు గోవులు కూడా ప్రమాదాల బారిన పడి చనిపోతున్నాయన్నారు. పశువుల రైతులు పాలు తీసుకొని గోవులను రోడ్డుమీదకు వదిలేస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు.

## ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

తణుకు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. న్యాయాధికారులు కెకృష్ణసత్యలత, పోతర్లంక సాయిరామ్, రంజిత్ కుమార్, చిరంజీవిరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పద్య పోటీల్లో విజేతలకు బహుమతులు

భీమవరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేమన పద్యాలు నేటి తరానికి ఆదర్శమని సర్ సీవీ రామన్ స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేమన జయంతి వేడుకలలో భాగంగా విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. బుధవారం పీఎస్ఎం హైస్కూల్‌లో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకుడు రంగసాయి తెలిపారు.

## ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కార్యాలయంలో 32 మంది వృద్ధులకు డా. బి.రమేష్‌చంద్రబాబు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి రిపోర్టులు అందజేసారు. సంఘ ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

## జింక్ లోపాన్ని నివారించాలి

నరసాపురం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో జింక్ లోపం నివారణకు ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్‌తో పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఈ డాక్టర్ అనిల్ కుమారి అన్నారు. మంగళవారం కొప్పర్రులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులు వాడుతున్న పురుగు మందులను పరిశీలించారు. అవసరానికి మించి మందులు వాడితే పంట దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఏవో జాన్సన్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. స్నేహ, ఎం. మహాలక్ష్మి, పోలిశెట్టి బాబా, శ్రీనివాసరావు, వెంకటేశులు, శ్రీను పాల్గొన్నారు.